



## కార్తికేయుడి జన్మదినం...

# వైకాశి విశాఖ పర్వదినం

దేవేరులతో వడపళని సుబ్రహ్మణ్యస్వామి





చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కార్తికేయుడిగా జన్మించిన వైకాశి విశాఖ దినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో తిరుచెందూరు, వడపళని,తిరుత్తణి,తిరుప్పరంకుంద్రం సహా మురుగన్ ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తిరుచెందూరు క్షేత్రంలో సోమవారం ఈ ఉత్సవాలను తిలకిం చేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరంతా వేకువజామునే సముద్రతీరంలోను, నాళికినరులోనూ స్నానమాచరించి స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. ఇదిలా ఉండగా రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సిరువాపురి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేశసౌభాగ్యాన్ని కోరుతూ, రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు కలుగాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆ తర్వాత గవర్నర్ రవి ఓ ప్రకటన విడుదల చేశారు.



సిరువాపురి బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గవర్నర్ ఆర్ఎన్ రవి

భక్త జనసంద్రంగా మారిన తిరుచెందూరు సముద్రతీరం


- వివరాలు 7లో


## వ్యవసాయ రంగంలో

# ఉపాధి అవకాశాల పెంపు

- సుస్థిర లక్ష్య సాధన
- 2030 దీర్ఘకాలిక ప్రణాళిక అమలు
- ఆటోమోటివ్ రంగంపై భవిష్యత్ దృష్టి
- సీఎంకు ప్రణాళికా సంఘం నివేదిక



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి నివేదిక సమర్పించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సభ్యులు

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రణాళికా సంఘం రూపొందిన నాలుగు నివేదికలను సోమవారం ఉదయం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేశారు. రాష్ట్రంలో మారుమూల గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించడానికి గల అవకాశాలు, సుస్థిరమైన సుదీర్ఘ లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన చర్యలు, 2030 విజన్ డాక్యుమెంటరీ అమలు, ఆటోమోటివ్ రంగంలో వాహనాల ఉత్పత్తి పెంచడంపై దృష్టిసారించడం వంటి అంశాలతో నివేదిక రూపొందించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఆ సంఘం కార్యాచరణ అధ్యక్షుడు ప్రొఫెసర్ జే జయరంజన్, ప్రణాళిక అభివృద్ధి ప్రత్యేక శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ మీనా, సభ్యురాలు ఎస్.సుధా కలిసి ఆ నివేదికలను సీఎంకు అందజేశారు. కుగ్రామాలలో వ్యవసాయ పనులను పెంచడంతో, అందుకు తగిన కూలీలను కూడా కేటాయించాలని, గ్రామాల్లో 15 నుంచి 34 యేళ్లలోపువారు స్థిర మైన సంపాదనపై ఆసకితో వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్నారని, వ్యవసాయరంగంలోనూ ఆదాయం వస్తుందని ప్రభుత్వం భరోసా కల్పిస్తే గ్రామాల నుంచి వలస పోతున్న యువతను నిరోధించవచ్చునని ప్రణాళికా సంఘం అభిప్రాయపడింది. ఇదే విధంగా దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన చర్యలు గురించి, 2030 విజన్ డాక్యుమెంట్ అమలుకు సంబంధిం చి ఏయే రంగాలను అభివృద్ధి పరచాలన్న వివరాలను కూడా సంఘం పేర్కొంది. ఆటోమోటివ్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్, హైడ్రోజన్, సీఎన్జీ, డీజిల్ సంబంధిత వాహనాల ఉత్పత్తులు పెంచేందుకు రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థ చేపట్టాల్సిన చర్యలను కూడా ప్రతిపాదించింది. చివరగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలు, రాష్ట్ర ఆర్థికరంగాన్ని ట్రిలియన్ డాలర్ స్థాయికి తీసుకెళ్లడానికి అమలు చేయాల్సిన పథకాలు కూడా ప్రణాళికా సంఘం నివేదికలో సూచించింది.



## హోదా మరచి

# మాపై దుమ్మెత్తిపోస్తారా?

- అసత్య ఆరోపణలతో బెదిరించటమే మీ పనా?
- ఎన్నికల హామీలపై నాతో చర్చకు సిద్ధమేనా?
- అమిత్‌షాకు ఎంపీ రాజా సవాల్

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అసత్య ఆరోపణలు చేసి, ఆయా రాష్ట్రాల్లో మతచిచ్చు రగల్చడమే పనిగా పెట్టుకున్నారని, మదురై సభలో హోదా కూడా మరచిపోయి తమపై విమర్శలు చేశారని డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ఎ.రాజా ధ్వజమెత్తారు. నగరంలో సోమవారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మదురై సభలో అమిత్‌షా ప్రసంగించిన తీరు రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని బెదిరించే ధోరణిలో ఉందని, అసత్య ఆరోపణలు చేస్తే తమిళ ప్రజలు సులువుగా నమ్ముతారని అనుకున్నట్లుందన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా డీఎంకే విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేర్చడంతో పాటు చెప్పని హామీలను కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేశారని వెల్లడించారు. డీఎంకే హామీల అమలుపై తనతో బహిరంగంగా చర్చించడానికి అమిత్‌షా సిద్ధమేనా అని ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి ఓ రాష్ట్రానికి వెళ్ళినప్పుడు ఆయనకున్న హోదా, బాధ్యత మరచిపోయి అక్కడి ప్రభుత్వాలపై అసత్యపు ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. మదురై సభలో అమిత్‌షా ప్రసంగాన్ని గమనిస్తే ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు రగిల్చే విధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న సుహృద్భావవాతావరణానికి గండికొట్టే రీతిలో ఆయన ప్రసంగించారన్నారు. రాష్ట్రంలోని కీలకమైన పథకాలకు కేంద్ర నిధులు విడుదల చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో ఆ పథకాలను అమలు చేస్తోందని, వాస్తవం ఇలా ఉండగా కేంద్రం భారీగా నిధులు మం జూరు చేసినట్లు ప్రకటించడం హాస్యాస్పదం గా ఉందన్నారు. అమిత్‌షా రాకతో డీఎంకే పాలకులంతా వణికిపోతున్నారని బీజేపీ నాయకులు చెప్పటం కూడా వింతగా, విడ్డూరంగా ఉందన్నారు. డీఎంకే అంటే భయంతోనే అమిత్‌షా రాష్ట్రానికి అదే పనిగా వచ్చివెళ్తున్నారని రాజా ఎద్దేవా చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో, శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా డీఎంకేకు అండగా నిలిచారన్న విషయాన్ని బీజేపీ పాలకులు మరచిపోయినట్లుందన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అంటే డీఎంకే నాయకులుగానీ, పార్టీ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. తమిళ భాష అంటే తనకు ఎంతో ఇష్టమని పదే పదే చెబుతున్న అమిత్‌షా తమిళ ప్రాచీన నాగరికత సంస్కృతిని వెలుగులోకి తెస్తున్న కీళడి తవ్వకాలపై సమర్పించిన రెండు నివేదికలను ఎందుకు అంగీకరించడం లేదో సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెబుతున్న అమిత్‌షా ఒకసారి మణిపూర్‌లో తాజాపరిస్థితులను స్వయం గా వెళ్ళి పరిశీలిస్తే సబబుగా ఉంటుందన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలిచి రాష్ట్రంలో అన్నాడీఎంకే - బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో వస్తుందని అమిత్‌షా చేసిన ప్రకటనపై అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన రాజ్యసభ

# నామినేషన్ల ఘట్టం

- ఆరుగురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ?

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నామినేషన్ల ఘట్టం సోమవారంతో ముగిసింది. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే నుంచి ఆరుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం ఆరు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 19వ తేదీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో డీఎంకే 4, అన్నాడీఎంకేకు ఇద్దరు చొప్పున అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉంది. ఈ ఎన్నికలకు నామినేషన్ దాఖలుకు గడువు సోమవారంతో ముగిసింది.

10వ తేదీ నామినేషన్ల పరిశీలన, 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాల ఉపసంహరణకు గడువు వుంది. 19వ తేదీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. అయితే, ఈ రెండు పార్టీల అభ్యర్థులతో పాటు మరో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో నిలిచారు. కానీ, వీరికి ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో డీఎంకే నుంచి నలుగురు, అన్నాడీఎంకే తరఫున ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికల్లో సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ప్రభుత్వ సంరక్షణ కేంద్రంలో

# బాలికపై లైంగిక వేధింపులు

- సెక్యూరిటీ గార్డ్ అరెస్ట్

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలోని చిట్లపాక్కంలో ప్రభుత్వ బాలికల సంరక్షణ కేంద్రంలో ఉంటూ చదువుకుంటున్న 13ఏళ్ళ విద్యార్థినిపై ఆదివారం రాత్రి లైంగిక వేధింపులకు పాల్పడిన సెక్యూరిటీ గార్డ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంరక్షణా కేంద్రాలు పనిచేస్తున్నాయి. పేదకుటుంబాలకు చెందిన బాలికలు ఈ కేంద్రాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, తాంబరంలోని సంరక్షణ కేంద్రంలో ఆదివారం రాత్రి నిద్రపోతున్న విద్యార్థినిపై అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ లైంగికంగా వేధించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే చర్యలు చేపట్టిన పోలీసులు బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ గార్డ్‌ను అరెస్టు చేశారు.

### ఆ సార్లను కంట్రోల్ చేయరా? ఈపీఎస్

విద్యార్థినుల పట్ల అమానుషంగా వ్యవహరించిన ఆ సార్లను కంట్రోల్ చేయరా? అని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రశ్నించారు. చిట్లపాక్కంలోని బాలికల సంరక్షణ కేంద్రంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై స్పందించిన ఈపీఎస్ సోమవారం తన ఎక్స్‌పేజీలో డీఎంకే ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఈ మేరకు పోస్టు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యంతో చిన్నారుల నుండి వృద్ధుల వరకు రక్షణ కరువైందని ఆరోపించారు. అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచార సంఘటనలో జ్ఞానశేఖరన్‌ను మాత్రమే అరెస్టు చేసిన పోలీసులు, ఆ ఘటనలో సంబంధాలున్న సార్‌ను కనీసం విచారణ చేయలేదని ఆరోపించారు. తమిళనాడు దేశ రాజధాని ఢిల్లీకి 'ఆవుటాఫ్ కంట్రోల్'గా ఉన్నట్లు ఎవరో రాసిచ్చిన డైలాగులు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఆ సార్‌లను ఎప్పుడు కంట్రోల్ చేస్తారని ప్రశ్నించారు.

### హాస్టళ్లలో మహిళా పోలీసులు: మంత్రి గీతా జీవన్...

రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళల హాస్టళ్లలో ఇక నుంచి మహిళా పోలీసులను నియమించనున్నట్లు సామాజిక సంక్షేమ, మహిళల హక్కులశాఖ మంత్రి గీతా జీవన్ పేర్కొన్నారు. ట్రిప్లికేన్‌లోని లేడీ వెల్లింగ్ టన్ కళాశాల ప్రాంగణంలో మంత్రి గీతా జీవన్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ బాలికల సంరక్షణ కేంద్రాల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించేలా మహిళా పోలీసులను నియమించనున్నట్లు తెలిపారు. చిట్లపాక్కం బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సెక్యూరిటీ గార్డును అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ మహిళల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సంబంధిత వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న బాలికలపై ఇప్పటివరకు ఎలాంటి వేధింపు సంఘటనలు జరగలేదని, భవిష్యత్తులో కూడా తలెత్తకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి గీతా జీవన్

# 11 జిల్లాలకు భారీ వర్షసూచన

## కోవై, నీలగిరి జిల్లాలకు మూడు రోజుల 'ఆరెంజ్' అలర్ట్

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాల్లో ఈ నెల 13,14,15 తేదీల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. అలాగే, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపూర్ సహా 11 జిలాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ విషయమై ఆ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... మంగళవారం రాణిపేట, వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, ఈరోడ్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముంది. 13,14,15 తేదీల్లో నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాల్లో అతి భారీవర్షం, దిండుగల్, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి, తిరునల్వేలి కొండ ప్రాంతాల్లో భారీవర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు

# ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు

- మంత్రి కొవి చెళియన్



పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో కొన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థినీ, విద్యార్థులకు జూన్/జూలై నెలల్లో ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరంలో సోమవారం మంత్రి చెళియన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పలు పథకాలు పరిచయం చేస్తూ, వారి విద్యా సామర్థ్యం పెంపొందించేలా కృషి చేస్తోందని తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించిన చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని పాలిటెక్నిక్ విద్యార్థులు మరో ఏడాది నష్టపోకుండా ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ...

ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలకు పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ నెల 18 నుంచి 23వ తేదిలోపు https://dte.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని మంత్రి తెలిపారు. 25వ తేది హాల్ టిక్కెట్లు విడుదల చేయనుండగా, 30 నుంచి జూలై 16వ తేది వరకు థియరీ, జూలై 17 నుంచి 25వ తేది వరకు ప్రాక్టికల్స్ నిర్వహించి జూలై 30వ తేది పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నామని తెలిపారు.

# 11 ఏళ్ళలో భారీగా తగ్గిన 'తీవ్ర పేదరికం'

- పుదుచ్చేరిలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్



పుదుచ్చేరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక పేదరిక నిర్మూలనలో ఫలితాలు కనిపిస్తున్నాయని, ఈ 11 ఏళ్ళలో సుమారు 27 కోట్లమంది తీవ్ర పేదరికం నుండి విముక్తులయ్యారని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. కేంద్రపాలిత రాష్ట్రమైన పుదుచ్చేరి అసెంబ్లీని కాగిత రహితంగా మార్చే జాతీయ 'ఈ-ధాన్' యాప్ ప్రారంభోత్సవం సోమవారం ఆ రాష్ట్రముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాకిఇ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రమంత్రి మురుగన్ మీడియాతో మాట్లాడుతూ, దేశప్రజల అండదండలతో కేంద్రంలో మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ 12వ సంవత్సరంలోకి విజయవంతంగా అడుగుపెట్టారన్నారు. భారత్ చరిత్రలో ఏ ప్రధానమంత్రి కూడా వరుసగా మూడుసార్లు ఆ పదవిలో కొనసాగలేదన్నారు. భారతదేశం ఈ 11 సంవత్సరాల్లో 270 మిలియన్ల మందిని దారిద్ర్యరేఖకు ఎగువన పెంచినట్లు ప్రపంచ బ్యాంకు ప్రకటించిందని, ప్రపంచంలో డిజిటల్ పద్ధతిలో నగదు బట్వాడ చేసే దేశాల్లో భారత్‌ను ద్వితీయ స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ నిలిపారని ఆయన పేర్కొన్నారు. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా తమిళనాడులో రెండ్రోజులు పర్యటించడంతో డీఎంకే పాలకులు ఆందోళన చెందుతున్నారని త్వరలోనే టాస్మాక్ అవినీతి గుట్టురట్టవుతుందని మురుగన్ వెల్లడించారు.

# టీవీకేలోకి మాజీ ఐఆర్ఎస్ అధికారి

- పార్టీలో చేరగానే ప్రచార కార్యదర్శి పదవి
- పార్టీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యేలు

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)లో చేరారు. వెంటనే ఆయన్ని పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార కార్యదర్శిగా నియమించారు. బిహార్‌లో ఐటీ అదనపు కమిషనర్‌గా పనిచేసిన అరుణ్‌రాజ్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. సోమవారం ఉదయం పనయూరులోని టీవీకే ప్రధాన కార్యాలయంలో విజయ్‌ను కలుసుకుని పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయనకు పార్టీ ప్రచార బాధ్యతలు అప్పగిస్తూ విజయ్ ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అరుణ్ దేనని ఆయన తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా పార్టీని పటిష్టం చేసి, పురోగమన దిశగా నడిపించాలని కూడా ఆయనకు సూచించినట్లు విజయ్ పేర్కొన్నారు. అదే విధంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో అన్నాడీఎంకే, డీఎంకేకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ న్యాయమూర్తి పార్టీలో చేరారు. వారిలో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే ఆర్.రాజలక్ష్మి, డీఎంకే మాజీ ఎమ్మెల్యే ఎస్.డేవిడ్ సెల్వన్, మాజీ అన్నాడీఎంకే ఎమ్మెల్యే, ద్రావిడ మున్నేక్కు మక్కల్ కట్చి వ్యవస్థాపకుడు డాక్టర్ ఎ.శ్రీధరన్, జేప్పియార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్, జేప్పియార్ రెమీ బాయ్ విద్యా ట్రస్టు నిర్వాహక ట్రస్టీ డాక్టర్ ఎస్.మరియా విల్సన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి సి.సుభాష్ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. వీరందరినీ పార్టీ కండువా వేసి సభ్యత్వ కార్డులను అందజేశారు. పార్టీ శ్రేణులంతా సహాయ సహకారాలందించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు.



టీవీకే కార్యాలయానికి వస్తున్న అరుణ్ రాజ్

## సమాచార దర్శిని

### 'కల్పనా చావ్లా' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ధైర్యసాహసాలు, సాహసోపేతమైన కృషి చేసిన మహిళలను అభినందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'కల్పనా చావ్లా' పురస్కారం అందజేస్తోంది. 2025వ ఏడాది పురస్కారం కోసం రాష్ట్రానికి చెందిన 18 ఏళ్లకు పైబడిన మహిళలు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో తాము చేసిన సాహసాల వివరాలతో దరఖాస్తులను ఈ నెల 16వ తేదిలోపు సమర్పించాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అవార్డు కింద బంగారు పూత రజత పతకం, రూ.5 లక్షల నగదు ముఖ్యమంత్రి అందజేయనున్నారు.

### రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**సోత్తుపెరుంబేడు:** సేక్కంజేరి, నెర్‌కుంద్రం, పుదుపాక్కం, అట్టపాళ్యం, సోత్తుపెరుంబేడు కొంత భాగం, కన్నియంపాళయం, పనువన్‌పాళయం, జ్ఞాయిరు, మపుష్కాన్‌పేట

**ఈస్ట్ మొగప్పేర్:** ఇళంగో నగర్, మూర్తి నగర్, ఆఫీసర్స్ కాలని, పింక్ అవెన్యూ, సత్యవతి నగర్ కొరట్టూరు కేఆర్ నగర్, దేవదాస్ వీధి, నందనం వీధి, జానకిరామన్ కాలని, నాగమ్మాళ్ వీధి, కస్తూరి నగర్ 1 నుంచి 3 వీధులు, తిల్లై నగర్, 17 నుంచి 24, 35 నుంచి 47 వీధులు, సెంట్రల్ అవెన్యూ, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీ వీధి, ఏరిక్కరై వీధి, నార్త్ అవెన్యూ

### ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ ఆర్ట్స్ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటన వెలువడింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 'టాన్సెట్' రాసిన విద్యార్థులు ఈ నెల 30వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలి. జూలై 14న ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలిపింది.

### నేడు గిరి ప్రదక్షిణ

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు రానున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం వెనుక వైపు 14 కి.మీ గిరి ప్రదక్షిణ చేసేందుకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ ప్రకారం, వైకాశి పౌర్ణమి ఘడియలు మంగళవారం మధ్యాహ్నం 12.27 గంటలకు ప్రారంభమై 11వ తేది మధ్యాహ్నం 1.53 గంటల వరకు కొనసాగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే విల్లుపురం నుంచి తిరువణ్ణామలైకు అన్‌రిజర్వ్‌డ్ రైలు నడుపనుంది.

### సీఎం స్టాలిన్ సేలం పర్యటన
### 11, 12 తేదీల్లో డ్రోన్లపై నిషేధం

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధ/గురువారాల్లో సేలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సేలం జిల్లాలో ఆ రెండ్రోజులు డ్రోన్లపై నిషేధం విధించినట్లు కలెక్టర్ బృందాదేవి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డెల్టా జిల్లాల్లోని వ్యవసాయ భూములకు ఈ నెల 12న సేలం సమీపంలోని మెట్టూరు డ్యాం నీటిని ముఖ్యమంత్రి స్టాలిన్ విడుదల చేయనున్నారు. అనంతరం సేలం ప్రభుత్వ మోహనకుమార మంగళం వైద్యకళాశాల ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమంలో సీఎం పాల్గొని కొత్త పథకాలకు శంకుస్థాపన చేసి, పూర్తైన పథకాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తారు. సీఎం పర్యటన సందర్భంగా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బృందాదేవి తెలిపారు.

### వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు శిక్షణ

పెరంబూర్, జూన్ (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి , రూ.3 కోట్లతో 20వేల మంది విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాలలు, కళాశాలల్లో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ, గణన, మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నివారణ వంటి అంశాలపై విద్యార్థులను సిద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందుకోసం విద్యార్థులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి 'యంగ్ నేచర్ రేంజర్స్' పేరుతో సర్టిఫికెట్లు అందజేయనున్నామని, ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

### 12 నుంచి కొత్త టోల్ ప్లాజా

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త టోల్ ప్లాజా ఈ నెల 12న ప్రారంభం కానుంది. ఈ మేరకు జాతీయ రహదారుల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో... తంజావూరు-విక్రవాండి జాతీయ రహదారిలో సేత్తియాతోపు-మానంపాడి మధ్య కొత్త టోల్ ప్లాజా ఏర్పాటు కానుంది. ఛార్జీల వివరాలిలా.. కారు, వ్యాన్ తదితర చిన్నరకం వాహనాలు ఒకసారి వెళ్లేందుకు రూ.105, అదే రోజు తిరిగి వస్తే రూ.160గా నిర్ణయించారు. సరుకులు తీసుకెళ్లే వాహనాలు, మినీ బస్సులు తదితరాలకు ఒకసారికి రూ.170, తిరిగి వస్తే రూ.225 వసూలుచేయనున్నారు. ప్రైవేటు బస్సులకు రూ.360, రూ.540, ఏడు చక్రాలు కలిగిన భారీ వాహనాలకు వన్‌వే రూ.685, తిరిగి వస్తే రూ.1,025 ఛార్జీగా నిర్ణయించారు.

### మెట్రోలో 39 కోట్ల మంది పయనం

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో ఏప్రిల్ నెల వరకు 39 కోట్ల మంది ప్రయాణించినట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. నగరంలో మెట్రోరైలు సేవలు గత 2015 జూన్ 29న ఆలందూర్-కోయంబేడు మధ్య ప్రారంభమయ్యాయి. అనంతరం విడతలుగా పలు మార్గాల్లో మెట్రోరైలు సేవలు విస్తరించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా మెట్రోరైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. త్వరలో నెలవారీ ప్రయాణికుల సంఖ్య కోటి దాటుతుందని సీఎంఆర్ఎల్ తెలియజేసింది.

# రామనాథపురంలో వ్యాన్‌ను ఢీకొన్న కారు

- ఐటీ ఉద్యోగి సహా ఇద్దరి మృతి
- 18 మందికి గాయాలు

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో టూరిస్టు వ్యాన్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఐటి ఉద్యోగి సహా ఇద్దరు దుర్మరణం చెందారు. సోమవారం వేకువజాము కడలూరు జిల్లా విరుదాచలం నుండి రామేశ్వరానికి భక్తులతో వెళ్తున్న టూరిస్టు వ్యాన్‌ను కీళ్‌క్కరై నుండి రామేశ్వరానికి వెళుతున్న కారు వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణించిన కడలూరు జిల్లా కూడలూరుకు చెందిన మహాలక్ష్మి (13) అనే బాలిక, కారులో ప్రయాణించిన కీళ్‌క్కరై హిందూబజార్‌కు చెందిన ఐటీ ఉద్యోగి వెంకటేష్ (27) ఘటనా స్థలంలోనే మరణించారు. కాగా వెంకటేష్‌కు జూలైలో వివాహం జరగాల్సి ఉంది. ఆలోగా అతడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబీకులు శోకతప్తులయ్యారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలలోనూ ప్రయాణించిన ఆరుగురు మహిళలు సహా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడినవారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో రామనాథపురం ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరిని మెరుగైన చికిత్స కోసం మదురై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉచ్చిపుళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.


ప్రమాదంలో ధ్వంసమైన టూరిస్టు వ్యాన్

### బైక్‌ను ఢీకొన్న బస్సు.. విద్యార్థి మృతి

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు సమీపంలో బైక్‌ను ప్రభుత్వ బస్సు ఢీకొన్న సంఘటనలో నందనం ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న బీ.కామ్ మూడో సంవత్సరం విద్యార్థి దీపక్ (19) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. చెంగల్పట్టు సమీపంలోని వందనం ప్రాంతానికి చెందిన దీపక్ తన మిత్రుడు దర్శన్ (18)తో పాటు వల్లం నుంచి చెంగల్పట్టుకు ఆదివారం బైక్‌లో వెళ్ళారు. దర్శన్ బైక్ నడుపగా, దీపక్ వెనుక సీటులో కూర్చున్నాడు. చెంగల్పట్టు-తిరుక్కలికుండ్రం రహదారిలోని మేలమయూర్ ప్రాంతంలో వెనుకనుంచి బస్సు వారి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దీపక్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, దర్శన్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలిసి అక్కడి చేరుకున్న చెంగల్పట్టు పోలీసులు అంబులెన్స్‌లో దర్శన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి జరిపిన విచారణలో సోమవారం పుట్టిన రోజు వేడుకలను సంతోషంగా జరుపుకోవాల్సిన దీపక్ ప్రమాదంలో మృతిచెందిన విషయం వెలుగు చూసింది.

### పారిశ్రామికవేత్తను మోసగించిన
## సబ్ రిజిస్ట్రార్ సహా 9 మందిపై కేసు

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పుదుక్కోటలో నకిలీ పత్రాలతో ఒక పారిశ్రామికవేత్తను మోసం చేసిన కేసులో సబ్ రిజిస్ట్రార్‌తో సహా మొత్తం 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ముగప్పేరుకు చెందిన రామనాథన్ (47) పుదుక్కోట జిల్లా నేర విభాగం పోలీసులకు ఓ ఫిర్యాదు చేశారు. 2014లో పుదుక్కోట కార్పొరేషన్ గోల్డెన్ నగర్‌లో ఐదుగురు వ్యక్తులకు చెందిన 125 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. ఈ స్థలం విలువ రూ.2.72 కోట్లు. 2024లో ఈ స్థలంలో వేరే వ్యక్తులు పని చేస్తున్నట్టు సమాచారం రావడంతో అక్కడకు వెళ్ళి విచారించగా, ఈ స్థలాన్ని ఇంద్రాణి అనే మహిళ పేరుతో రిజిస్టర్ అయినట్టు తేలింది. దీనిపై 2024 డిసెంబరు నెల 16వ తేదీన పుదుక్కోట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశం మేరకు నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, నకిలీ పత్రాలు సృష్టించి, ఇంద్రాణి పేరుకు రిజిస్టర్ చేసినట్టు తేలింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ ఇళయరాజాతో సహా మొత్తం 9 మందికి సంబంధం ఉన్నట్టు తేలడంతో వారందరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# కిలాంబాక్కం నుంచి అదనపు బస్సులు

### మంత్రి శివశంకర్

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి అదనపు బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ తెలిపారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి దక్షిణ జిల్లాలకు బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పండుగలు, వారాంతపు రోజుల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, గత శనివారం రాత్రి బస్సులు సక్రమంగా నడపకపోవడంతో ప్రయాణికులు బస్ టెర్మినల్ ముందు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ విషయమై ఎడప్పాడి పళనిస్వామి, విజయ్ సహా పలు ప్రతిపక్షాల నేతలు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ నేపథ్యంలో, రవాణా శాఖ మంత్రి శివశంకర్ సోమవారం రవాణా శాఖ అధికారులతో సమావేశమై కిలాంబాక్కం నుంచి వెళ్తున్న బస్సులు, ప్రయాణికుల సంఖ్య, అదనంగా నడుపుతున్న బస్సులు తదితరాలపై చర్చించారు. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైతే ప్రత్యేక బస్సులు నడిపేలా అధికారులను మంత్రి శివశంకర్ ఆదేశించారు.

### అన్నాడీఎంకే విజయం కోసం
## శ్రీవిల్లిపుత్తూరులో ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న గౌతమి

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయం సాధించాలన్న శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు సినీనటి గౌతమి తెలిపారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయానికి సోమవారం వచ్చిన నటి గౌతమి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గౌతమిని స్థానిక అన్నాడీఎంకే నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌతమి మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించినందువల్ల మహిళల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజపాళయం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తాను ఎన్నికలు నిర్వహించిన తీరు అందరికి తెలుసన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాల్సిన అభ్యర్థులను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎంపిక చేస్తారని తనకు అవకాశం వస్తే తప్పకుండా విజయం సాధిస్తానన్నారు.

# విద్యా నిధుల కోసం సుప్రీంలో అప్పీల్

- తక్షణం రూ.2291 కోట్ల విడుదలకు వినతి
- పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలి

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూ.2,291 కోట్ల విద్యా నిధులను తక్షణం విడుదల చేసేలా ఆదేశించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు సోమవారం అప్పీల్ పిటిషన్ దాఖలు చేసి, దానిపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు, దానిపై సంతకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం లేదు. నూతన విద్యా విధానంలో భాగంగా 'పీఎం శ్రీ' పథకం కింద రాష్ట్రంలో కొత్తగా మోడల్ స్కూల్స్ ఏర్పాటు కోసం కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంది. అయితే, ఈ ఒప్పందంతో రాష్ట్రంలో హిందీ భాషను నిర్బంధంగా అమలు చేయాల్సి ఉంటుందన్నది రాష్ట్ర ప్రభుత్వ వాదన. ఇదిలావుంటే, ఎస్ఎస్‌పై పథకం కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.2,152 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. పీఎం శ్రీ పథకంపై సంతకం చేస్తేనే ఈ నిధులను విడుదల చేస్తామంటూ కేంద్ర మానవవనరుల శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. తమిళనాడుతో పాటు కేరళ, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలకు కూడా ఈ నిధులను కేంద్రం విడుదల చేయలేదు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించకపోవడం, పీఎం శ్రీ పథకాన్ని అమలు చేయకపోవడం వంటి కారణాలతో విద్యా నిధులను నిలిపివేయడం ఏమాత్రం భావ్యం కాదని, ఆ నిధులను తక్షణం విడుదల చేయాలంటూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా స్పష్టం చేసింది. అయినప్పటికీ కేంద్రం నిధులను విడుదల చేయలేదు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లకు ముఖ్యమంత్రి స్టాలిన్ పలు మార్లు లేఖలు రాసినప్పటికీ చలనం లేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విద్యా నిధులను కేంద్రం మంజూరు చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని, అందువల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.2291.30 కోట్ల విద్యా నిధులను తక్షణం విడుదల చేయాలని, ఇదే విషయంపై కేంద్రాన్ని కూడా ఆదేశించాలని ప్రభుత్వం కోరింది. ఇదిలావుంటే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీకే మిశ్రా సారథ్యంలోని ధర్మాసనంలో ఓ అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో 'జూన్ మూడో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. గత యేడాది కాలంగా కేంద్రం నిధులను విడుదల చేయలేదు. ఈ కారణంగా సుమారుగా 48 వేల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైవుంది. అయితే, విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా అప్పీల్ పిటిషన్ దాఖలు చేస్తున్నాం. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని ప్రభుత్వం కోరిది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. వేసవి సెలవుల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం లేదని, ఏదిఏమైనా వినతిని పరిగణనలోకి తీసుకుంటామని న్యాయమూర్తి పీకే మిశ్రా పేర్కొన్నారు.

# ఆక్రమణదారులను శిక్షించాలి

- పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల నిరసన


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేస్తున్న గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుత్తణి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని పరాశపురం గ్రామ పరిధిలోవున్న శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులు నిరసనకు దిగారు. వివరాలిలా... మునిరత్నం, మునుస్వామి, నరసింహన్ అనే ముగ్గురు వ్యక్తులు శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి అందులో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తూ, మూడు నెలల క్రితం పంచాయతీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం రాత్రి సమయంలో ఆ ముగ్గురు ఫిర్యాదులిచ్చిన వారి ఇళ్లపై దాడిచేశారని, దానికి సంబంధించిన వీడియో ఆధారాలు చూపుతూ, వెంటనే మునిరత్నం, మునుస్వామి, నరసింహన్‌లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులు నిరసనకు దిగారు. నిరసన విరమించమని ఉన్నతాధికారులతో మాట్లాడి దీనిపై పరిష్కారం చూపుతామని తెలుపగా, గ్రామస్థులందరూ కలిసి సంతకాలు చేసి మరో ఫిర్యాదుపత్రాన్ని పోలీసులకు అందజేసి తిరిగివెళ్ళిపోయారు.

### చెన్నై విమానాశ్రయంలో 1.4 కిలోల బంగారం స్వాధీనం

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దుబాయ్, థాయ్‌ల్యాండ్ దేశాల నుంచి విమానాల్లో అక్రమంగా బంగారం తరలించిన ఇద్దరు ప్రయాణికుల నుండి 1.4 కిలోల బంగారాన్ని చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్, థాయ్‌ల్యాండ్ దేశాలనుంచి బంగారం తరలిస్తున్నారనే సమాచారంతో కస్టమ్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం తెల్లవారుజామున ఈ విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుల్లో ఇద్దరిపై అనుమానంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి బ్యాంగుల్లో తరలిస్తున్న రూ.1.30 కోట్ల విలువైన 1.4 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో బస్ డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిలాంబాక్కం బస్టాండ్‌లో మద్యం సేవించి బస్సు నడిపిన డ్రైవర్‌కు పోలీసులు రూ.10 వేల జరిమానా విధించారు. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వెళ్లడం, అతివేగంగా వెళ్లే వాహనచోదకులు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం కిలాంబాక్కం బస్టాండ్‌లో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ఆమ్నీ బస్సు ఆపారు. ఆ సమయంలో బస్సు డ్రైవర్ వేలు మాట తడబడుతుండడంతో పోలీసులు అనుమానించి పరీక్ష చేయగా, అతను మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించి, రూ.10 వేల జరిమానా విధించారు.

### శంకరాపురం ఎస్ఐని సస్పెండ్ చేయండి

- హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులు అమలుచేయని శంకరాపురం ఎస్ఐ వినాయక మురుగన్‌ను సస్పెండ్ చేయాలని కళ్లకుర్చి జిల్లా ఎస్పీని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5 లక్షల మోసానికి పాల్పడిన కేసులో సత్వరం ఛార్జిషీటు దాఖలుచేయాలని 2024 మార్చిలో ఇచ్చిన ఉత్తర్వులు అమలుచేయపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు, ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని డీజీపీకి ఉత్తర్వులు జారీ చేసింది.

### ఛార్జిషీటు నకలు పొందిన సెంథిల్ బాలాజి

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా చట్ట వ్యతిరేక నగదు బట్వాడా నిషేధ చట్టం కింద నమోదైన కేసులో సెంథిల్ బాలాజీ సోదరుడు సహా 12 మందికి అదనపు ఛార్జిషీటు నకళ్లు అందజేశారు. నేరాపణలు ఎదుర్కొంటున్న సెంథిల్ బాలాజి, ఆయన సోదరుడు అశోక్‌కుమార్ సహా అందరూ సోమవారం కోర్టు విచారణకు హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 23వ తేదీకి వాయిదావేస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

### రికార్డు స్థాయిలో సొనాలికా ట్రాక్టర్ విక్రయాలు

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ట్రాక్టర్ విక్రయాల్లో మొదటి స్థానంలో ఉన్న సొనాలిక ట్రాక్టర్స్ 2025-26 ఆర్థిక సంవత్సరం మేలో అత్యధిక విక్రయాలను నమోదు చేసింది. ఈ కొత్త మైలురాయి సోనాలికా ట్రాక్టర్లపై రైతులు పెట్టుకున్న నమ్మకానికి ప్రతీకగా కంపెనీ పేర్కొంది. అతి పెద్ద ఇంజిన్లు, అధునాతన ట్రాన్స్‌మిషన్, దేశంలోని ప్రాంతీయ నేల వైవిధ్యం ఇలా అన్ని అంశాలు అనుకూలంగా ఉండటం ఈ కంపెనీ విక్రయాలకు ప్రధాన కారణం. కచ్చితమైన హైడ్రాలిక్స్ వంటి అనేక అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న కారణంగానే తమ ట్రాక్టర్లను కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని సొనాలికా ట్రాక్టర్స్ (ఇంటర్నేషనల్) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రమణ్ మిట్టల్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### 19న నందబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఆక్మీ-2025 ఎగ్జిబిషన్ ప్రారంభం

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో 'ఆక్మీ-2025' పేరుతో అంతర్జాతీయ యంత్ర పరికరాల ప్రదర్శనను ఈ నెల 19నుంచి 23 దాకా నిర్వహించనున్నట్లు ఎగ్జిబిషన్ ఛైర్మన్ పీఎస్ రమేష్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ (అయిమా) ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రదర్శన ద్వారా రూ.750 కోట్ల మేర వాణిజ్య కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉందని చెప్పారు. ఈ ప్రదర్శనలో 120 విదేశీ కంపెనీలు, 468 స్వదేశీ కంపెనీలకు చెందిన ఉత్పత్తులు, యాంత్రిక పరికరాలుంటాయన్నారు. అదే విధంగా ఈ నెల 21న ఆర్‌టెక్-2025 పేరుతో ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ టెక్నాలజీ షో కూడా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆక్మీ -2025 కన్వీనర్ జి.వేణు, అయిమా అధ్యక్షుడు ఆర్ఎస్ఎస్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

### అధికారంలోకి రాబోయేది అన్నాడీఎంకే కూటమే

- మైనార్టీ మోర్చా కార్యదర్శి ఇబ్రహీం


మీడియాతో మాట్లాడుతున్న ఇబ్రహీం

తిరుత్తణి, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బీజేపీ జాతీయ ముస్లిం మైనార్టీ సెల్ కార్యదర్శి ఇబ్రహీం ధీమా వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అమ్మవారికుప్పంలో జిల్లా బీజేపీ పారిశ్రామిక విభాగం అధ్యక్షుడు వేలు ఇంట్లో ఆదివారం జరిగిన వివాహానికి ఆయన పాల్గొన్నారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమి నాయకులంతా అనాగరిక రాజకీయ పద్ధతులను అనుకరిస్తున్నారన్నారు. ప్రజాశ్రేయస్సు, సంక్షేమం కోసం అన్నాడీఎంకే కూటమి పోరాడుతుందని, త్వరలోనే ప్రజలు డీఎంకేను ఇంటికి సాగనంపుతారని తెలిపారు.

### తిరువణ్ణామలైలో ఆక్రమణలు తొలగించాలి

- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో తామర కొలను చుట్టూవున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తామర కొలను చుట్టూవున్న ఆక్రమణల నుంచి మానవ వ్యర్థాలు తీర్థకొలనులో కలుస్తున్నాయని ఆరోపిస్తూ యానై రాజేంద్రన్ అనే భక్తుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో 46 ఆక్రమణలను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం వాటిని తొలగించలేదని న్యాయస్థానానికి వివరించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఆక్రమిత కట్టడాలకు ఏ హోదాలో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారో నివేదిక ఇవ్వాలని తమిళనాడు విద్యుత్ బోర్డును ఆదేశించింది. అలాగే ఆక్రమణలను వెంటనే తొలగించాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసి, కేసు విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

### బాల్కనీ కూలి ఐదుగురికి గాయాలు

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం, అన్నై సత్యా నగర్‌లో ఓ ఇంటి బాల్కనీ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వలస కూలీలు గాయపడ్డారు. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... అన్నై సత్యా నగర్‌కు చెందిన జిక్కా అనే వ్యక్తికి చెందిన ఇంటిని ఒడిశా రాష్ట్రానికి చెందిన పది మంది కూలీలు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. ఆదివారం రాత్రి వీరంతా మొదటి అంతస్తు బాల్కనీలో కూర్చొని మాట్లాడుకుంటుండగా బాల్కనీ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ శిథిలాల కింద చిక్కుకున్న కార్మికుల్లో ఐదుగురుకు తీవ్రంగా గాయపడగా, మరో నలుగురుకి చిన్న గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద స్థలాన్ని మాధవర్ సీఐ భూపాలన్ పరిశీలించారు.

### ధనుష్కోటికి చేరిన లంక తమిళులు



పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన శ్రీలంక తమిళులు ఐదుగురు ధనుష్కోటి అరిచ్చల్‌మునైకు చేరుకోగా, మెరైన్ పోలీసులు వారిని విచారిస్తున్నారు. శ్రీలంక కండి ప్రాంతంలో నివసిస్తున్న ఐదుగురు సభ్యులతో ఓ కుటుంబం, ఆదివారం రాత్రి జాఫ్నా నుంచి ఫైబర్ క్లాస్ పడవలో బయల్దేరి సోమవారం తెల్లవారుజామున రామేశ్వరం ధనుష్కోటి అరిచ్చల్‌మునై చేరుకున్నారు. స్థానిక జాలర్ల సమాచారంతో అక్కడకు చేరుకున్న మెరైన్ పోలీసులు, స్పృహతప్పిన పిల్లలకు తాగునీరు, పాలు అందించి, ఐదుగురిని ధనుష్కోటి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. శ్రీలంకలో పాల పౌడర్, మందులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, ఉపాధి కూడా లభించకపోవడంతో కుటుంబంతో సహా ఇక్కడకు వచ్చినట్లు వారు తెలిపారు.

### రాజధాని నగరంలో పెండింగ్ కేసులెన్ని?

- పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని పోలీస్‌స్టేషన్లలో 2024 జూన్ వరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను జూలై 8వ తేదీ లోగా నివేదికగా అందజేయాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ ఎ.అరుణ్‌ను మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. నులంబూరులోని రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఓనర్స్ సంఘం నిధుల్లో అవకతవకలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదుచేసిన అదే అపార్ట్‌మెంటులో నివసిస్తున్న దళితవర్గానికి చెందిన వనమామలై అనే వ్యక్తిని కులంపేరుతో దూషించి అవమానించినట్లు సోషల్ మీడియాలో వైరలైంది.. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వీడియో వైరల్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేసినా నులంబూరు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ వనమామలై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ విచారణ జరపి వనమామలై ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోవడంపై కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు సోమవారం గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ హైకోర్టులో జరిగిన విచారణకు హాజరయ్యారు. వనమామలై నుంచి తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వచ్చివుంటే తప్పకుండా చర్యలు తీసుకునేవాడినని తెలిపారు. ఇరుతరుపు వాదనల అనంతరం నగరంలోవున్న పోలీస్‌స్టేషన్లలో 2024 జూన్ వరకు ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి?, ఎన్ని కేసులలో ఛార్జిషీటులు దాఖలయ్యాయి? ఎన్ని కేసులపై దర్యాప్తు పూర్తిచేశారు? పెండింగ్‌లోవున్న కేసులున్నాయి? తదితర వివరాలను జూలై 8వ తేదీలోపు నివేదికగా అందజేయాలని పోలీస్ కమిషనర్‌కు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఉత్తర్వులు జారీచేశారు.

### అఖిల భారత చెస్ పోటీ విజేత శైలేష్


విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఎస్‌వీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నక్షత్ర స్కూల్‌లో జరుగుతున్న అఖిల భారత చెస్ పోటీల్లో తమిళనాడుకు చెందిన రేటింగ్ క్రీడాకారుడు ఆర్.శైలేష్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే తెలంగాణాకు చెందిన పి.రామకృష్ణ ద్వితీయస్థానం, తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం తృతీయస్థానం సాధించారు. సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్ నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు, వివిధ వయో విభాగాల నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ సిహెచ్.సందీప్‌రెడ్డి, జీవన్‌కృష్ణ, టోర్నీ నిర్వాహకులు వంశీకృష్ణ, సుధాశ్రీ, సుశీల, చీఫ్ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 27న విక్రమ్ ప్రభు 'లవ్ మ్యారేజ్' రిలీజ్

సీనియర్ నటుడు ప్రభు తనయుడు విక్రమ్ ప్రభు హీరోగా నటించిన 'లవ్ మ్యారేజ్' మూవీ ఈ నెల 27న విడుదలకానుంది. ఈ మేరకు మేకర్స్ ఓ పోస్టరు ద్వారా అధికారికంగా వెల్లడించారు. 'ఇరుగపట్రు' వంటి హిట్ మూవీ తర్వాత విక్రమ్ ప్రభు 'రైడ్' చిత్రంలో నటించగా అది నిరాశకు గురిచేసింది. కొన్ని నెలల విరామం తర్వాత కొత్త చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. డెబ్యూ డైరెక్టర్ షణ్ముగ ప్రియన్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో సుష్మిత భట్, మీనాక్షి దినేష్, రమేష్ తిలక్, అరుల్‌దాస్, గజరాజ్ తదితరులు నటించారు. సీనియర్ నటుడు సత్యరాజ్ గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారు. రైజ్‌ఈస్ట్ బ్యానరుపై తెరకెక్కిన ఈ చిత్రానికి డాక్టర్ శ్వేత శ్రీ, శ్రీనిధి సాగర్ నిర్మాతలు. వివాహం ఆలస్యం కావడంతో హీరో సమాజంలో ఎదుర్కొనే సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని ఈ మూవీని రూపొందించారు. తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా శక్తి ఫిలిమ్ ఫ్యాక్టరీపై నిర్మాత శక్తివేలన్ రిలీజ్ చేయనున్నారు.



'లవ్ మ్యారేజ్'లో ఓ దృశ్యం

## 500 థియేటర్లలో విడుదల కానున్న 'పడై తలైవన్'

దివంగత నటుడు విజయకాంత్ చిన్న కుమారుడు షణ్ముగ పాండియన్ నటించిన 'పడై తలైవన్' మూవీ ఈ నెల 13వ తేదీ 500కు పైగా థియేటర్లలో విడుదల చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు. వాస్తవానికి ఈ మూవీని గత నెల 23వ తేదీన విడుదల చేయాల్సివుంది. ఆ రోజున పలు చిత్రాలు విడుదల కావడంతో 'పడై తలైవన్'కు ఆశించిన రీతిలో థియేటర్లు లభించలేదు. దీంతో మూవీ రిలీజ్‌ను వాయిదా వేశారు. ఇపుడు అనుకున్న స్థాయిలో థియేటర్లు లభించడంతో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. కాగా, అన్బు దర్శకత్వం వహించిన ఈ మూవీలో షణ్ముగ పాండియన్, కస్తూరి రాజా, యామిని చందర్, గరుడన్ రామ్ తదితరులు నటించారు. సింహభాగం చిత్రీకరణ అటవీ ప్రాంతంలోనే పూర్తి చేశారు. ఇళయరాజా సంగీతం సమకూర్చిన ఈ మూవీని కెప్టెన్ సినీ క్రియేషన్స్ రిలీజ్ చేయనుంది.



'పడై తలైవన్'లో షణ్ముగ పాండియన్

**చిత్రజ్యోతి**



త్రిష

## సినిమాను నిజజీవితంతో ఎందుకు పోలుస్తారు?

**ట్రోల్స్‌పై త్రిష రుసరుసలు**

అగ్ర నటుడు కమల్ హాసన్ - దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'థగ్ లైఫ్' మూవీ ఈ నెల 5వ తేదీన విడుదల కాగా ఈ సినిమాలోని తన పాత్రకు నెగెటివ్ కామెంట్స్ రావడంతో హీరోయిన్ త్రిష తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇందులో ఇంద్రాణి పాత్రలో త్రిష నటించగా, ఈ పాత్రపై సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. దీనిపై త్రిష స్పందిస్తూ, 'మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' మూవీలోని 'కుందవై' పాత్రను అమితంగా ఇష్టపడ్డారు. ఈ పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. నా కెరీర్‌లో ఒక ముఖ్యపాత్రగా మారింది. కానీ, 'థగ్ లైఫ్' మూవీలో ఇంద్రాణి పాత్రపై విమర్శలు గుప్పిస్తున్నారు. కమల్, శింబుల పాత్రలతో సాగే నా క్యారెక్టర్‌ను కొందరు అసభ్య పదజాలంతో ట్రోల్స్ చేస్తున్నారు. మరికొందరు మలయాళ బిట్ సినిమాలతో పోల్చుతున్నారు. ఇది ఒక సినిమా.. ఒక పాత్ర. దర్శకుడు చెప్పినట్టుగా నటించాను. మణిరత్నం - కమల్ కాంబోపై ఘాటైన విమర్శలు మంచిదా? నేను ఏం చేశాను? సోషల్ మీడియా వైపు చూడాలంటేనే భయం వేస్తోంది. సినిమాను నిజ జీవితంతో ఎందుకు పోలుస్తారు?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, 'థగ్ లైఫ్'కు నెగెటివ్ కామెంట్స్ రావడానికి కథ, స్క్రీన్ ప్లే సరిగా లేకపోవడంతో ప్రేక్షకులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్న చర్చ సాగుతోంది.

**తొలి భక్తి పాట రిలీజ్**

## సంగీత దర్శకుడిగా ఇళయరాజా మనవడు

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఎవరూ అధిరోహించలేని స్థానాన్ని దక్కించుకున్న 'ఇసైజ్ఞాని' ఇళయరాజా కుటుంబం నుంచి మరో సంగీత దర్శకుడు వచ్చారు. ఇళయరాజా పెద్ద కుమారుడు కార్తీక్ రాజా తనయుడు యదీశ్వరన్ సంగీత దర్శకుడిగా అవతారమెత్తారు. తన తొలిపాటను శ్రీ అరుణ చలేశ్వర స్వామిపై రూపొందించి తాజాగా రిలీజ్ చేశారు. ఇళయరాజా తరహాలోనే పరమశివుడిని, రమణ మహర్షిని అమితంగా ఆరాధించే యదీశ్వరన్.. తన తొలి భక్తి పాటను తిరువణ్ణామలైలోని రమణ మహర్షి ఆశ్రమంలోనే, ఆ ఆశ్రమ నిర్వాహకులతో విడుదల చేయించడం గమనార్హం. దీనిపై యదీశ్వరన్ మాట్లాడుతూ, 'నాకు బాల్యం నుంచే సంగీతంపై మక్కువ. నా తొలి పాట భక్తి గీతం ఉండాలని భావించాను. తాత (ఇళయరాజా) కొన్ని సలహాలిచ్చారు. గేయ రచనలో డాడీ సహకరించారు. తాత, డాడీ, చిన్నాన్న (యువన్ శంకర్ రాజా), అత్త (దివంగత భవధారణి, ఇళయరాజా కుమార్తె) తరహాలోనే సినీ సంగీతంలో రాణించాలని ఉంది. మంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను' అన్నారు. కాగా, ఇండియన్ సినిమాలో ఒకే కుటుంబం నుంచి నలుగురు సంగీత దర్శకులు ఉండటం చాలా అరుదు. అది ఇళయరాజా ఫ్యామిలీకే వర్తించింది.



యదీశ్వరన్







తిరుచెందూరు ఆలయం వద్ద స్వామివారి ప్రతిమను భుజాలపై మోసుకెళుతున్న భక్తుడు - నోటిలో శూలాన్ని గుచ్చుకుని వెళ్తున్న వృద్ధుడు - ఆలయం వద్ద భక్తుల రద్దీ

# మురుగన్ ఆలయాల్లో వైకాశి విశాఖ ఉత్సవాలు

చెన్నై, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. తిరుచెందూరు క్షేత్రంలో వైకాశి విశాఖ వేడుకలలో భాగంగా సోమవారం వేకువజాము ఒంటిగంటకే ఆలయాన్ని తెరిచి, 1.30 గంటలకు స్వామివారి విశ్వరూప దర్శనం, ఉదయం 6. గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం 10 గంటలకు ఉచ్చికాల దీపారాధన నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల సాయం సంధ్యా దీపారాధన, ఆ తర్వాత షణ్ముఖ విలాసమండపంలో స్వామివారు మునికుమారులకు శాపవిమోచనం కలిగించే ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకలకు తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, రాజపాళయం, నాగర్‌కోవిల్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

### తిరుత్తణిలో...

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోనూ వైకాశి విశాఖ ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం మూలవర్లకు పాలు, పెరుగు, పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. మూలవర్లకు స్వర్ణకవచం, స్వర్ణ శూలాయుధం ధరింపజేసి ప్రత్యేక దీపారాధన జరిపారు.

## జనసంద్రంగా మారిన దేవాలయాలు

### సిరువాపురిలో...

తిరువళ్లూరు జిల్లా కవరపేటకు సమీపంలోని సిరువాపురి బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సోమవారం ఉదయం వైకాశి విశాఖ ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

### వడపళని ఆలయంలో...

నగరంలోని వడపళని మురుగన్ ఆలయంలోనూ వైకాశి విశాఖ ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. నగరం నలుమూలల నుండి వేకువజామునే ఆలయానికి రావటంతో పోలీసులు వారిని క్రమబద్ధీకరించి ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం క్యూలైన్లలోకి పంపారు. ఉదయం ఆరు గంటలకల్లా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పలు, ఆభరణాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వందలాది మంది భక్తులు నోటికి శూలాలు గుచ్చుకుని, వీపునకు ఇనుప కమ్మీతో స్వామివారి ప్రతిమలున్న బుల్లి రథాలను లాగుతూ ఆలయానికి తరలివచ్చారు. ఇదే విధంగా పుష్పకావళ్లు, పాలకావళ్లు మోసుకొచ్చారు. మహిళలు క్షీర కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు.



విరాళిమలై రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

### విరాలిమలైలో రథోత్సవం

విరాలిమలై మురుగన్ ఆలయంలోనూ వైకాశి విశాఖ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలలో మంత్రి సీవీ మెయ్యనాథన్, మాజీ మంత్రి సి. విజయభాస్కర్ పాల్గొని భక్తులతోపాటు రథం మోకు తాళ్లను పట్టుకుని లాగారు.

### తిరుప్పరంకుండ్రంలో...

మదురై సమీపంలోని తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయంలోనూ సోమవారం ఉదయం వైకాశి విశాఖ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గత మే 31న ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజూ వివిధ వాహనాల్లో స్వామివారు ఊరేగారు. సోమవారం వేకువజామునే షణ్ముఖస్వామి, వళ్ళి, దైవానైకి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము 5.30 గంటలకు కంబత్తడి మండపంలో షణ్ముగర్ వళ్ళి, దైవానై సమేతుడై విశాఖ కొట్రాడు మండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు క్షీరకలశాలను స్వామివారికి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి పాలకావళ్లు, పన్నీరు కావళ్ళు, పుష్పకావళ్లు మోసుకొచ్చారు. ఇదే విధంగా భక్తులు కొందరు నోటికి, వీపుపై శూలాలు గుచ్చుకుని ఆలయానికి విచ్చేశారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులక ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సత్యప్రియా బాలాజీ, సభ్యులు షణ్ముగసుందరం, మణి సెల్వం, ఆలయ డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణన్ భక్తులకు తగు ఏర్పాట్లు చేపట్టారు.





తిరుప్పరంకుండ్రంలో క్షీరకలశాలను మోసుకెళుతున్న భక్తులు - ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు











వడపళని ఆలయంలో స్వామివారికి హారతి పడుతున్న అర్చకులు - వడపళని ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు- ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు - వంటి నిండా శూలాలు గుచ్చుకుని ఆలయానికి వెళుతున్న భక్తుడు - క్షీర కలశాన్ని మోసుకెళుతున్న భక్తురాలు

## డాగ్ స్క్వాడ్‌లో కొత్త శునకాలు

పెరంబూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు డాగ్ స్క్వాడ్‌లో కొత్తగా చేరిన 11 శునకాలకు అదనపు కమిషనర్ పేర్లు సూచించారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ.అరుణ్ పర్యవేక్షణలో అడిషినల్ కమిషనర్ (ప్రధాన కార్యాలయం) నేతృత్వంలో కీల్పాక్కం, సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతాల్లో రెండు డాగ్ స్క్వాడ్ విభాగాలు పనిచేస్తున్నాయి. కీల్పాక్కం డాగ్ స్క్వాడ్‌లో 16 శునకాలుండగా, వాటిలో 11 బాంబులు గుర్తించడం, మూడు నేరస్తులను గుర్తించడం, రెండు మాదకద్రవ్యాలను గుర్తించడానికి వినియోగిస్తుంటారు. ఇక, సెయింట్ థామస్ మౌంట్ విభాగంలో ఏడు శునకాలున్నాయి. ప్రస్తుతం నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులతో 11 శునకాలు ఈ విభాగాల్లో చేరాయి. వీటిలో రెండు ల్యాబ్రాడోర్, మూడు బెల్జియం మాలినోయిస్, డాబర్‌మాన్ రకానికి చెందిన ఒకటి మొత్తం 6శునకాలు బాంబులు గుర్తించడం, మూడు బెల్జియం మాలినోయిస్, ఒక జర్మన్ షెపర్డ్ శునకాలు మాదకద్రవ్యాలు గుర్తించడం, ఒక డాబర్‌మాన్ రకానికి చెందిన శునకం క్రిమినల్ కేసుల్లో నిందితులను గుర్తించేందుకు వినియోగించనున్నారు. ఎగ్మూర్ రాజారత్నం స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో కొత్తగా చేరిన మూడు నెలల వయస్సున్న 11 శునకాలకు (8 మగ, 3 ఆడ) వెట్రి, విక్రమ్, నిత్ర, ముగలాన్, సిలంబన్, కురాలి, కారి, గుహన్, వెన్బా, ధీరన్, అలెగ్జాండర్ పేర్లు పెట్టారు. కార్యక్రమంలో అడిషినల్ కమిషనర్ హరికిరణ్ ప్రసాద్, రాధాకృష్ణన్ (సాయుధ దళం) సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



కొత్త శునకాలను చూపుతున్న సిబ్బంది



శునకాలకు పేర్లతో కూడిన ట్యాగ్ వేస్తున్న అడిషనల్ పోలీసు కమిషనర్

## రేలా హాస్పిటల్‌లో మహిళకు ఊపిరి తిత్తుల మార్పిడి



శస్త్ర చికిత్స చేసుకున్న మహిళతో రేలా హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, వైద్య బృందం

టి.నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో 44 యేళ్ల మహిళకు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స చేసి ఆమెను కాపాడినట్టు ఆస్పత్రి చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చికిత్స తర్వాత సంపూర్ణంగా కోలుకున్న మహిళను ఆయన పరిచయం చేశారు. హృద్రోగ శస్త్ర చికిత్స నివారించి ఆస్పత్రిలోని హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ హెడ్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనాథ్ విజయశేఖరన్, డాక్టర్ ఐశ్వర్యా రాజ్‌కుమార్ నేతృత్వంలోని వైద్యనిపుణులు సహా 30 మందితో కూడిన బృందం రెండు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందని ఆయన వివరించారు. ప్రస్తుతం దాతలిచ్చిన రెండు ఊపిరితిత్తులతో ఆ మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని పేర్కొన్నారు.

## 'కేసరి పాఠశాల'కు స్మార్ట్ బోర్డుల వితరణ



స్మార్ట్ బోర్డు పంపిణీ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలకు గిండి రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం 5 స్మార్ట్ బోర్డులను విరాళంగా అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందింపజేయాలన్న లక్ష్యంతో రోటరీ క్లబ్ స్మార్ట్ బోర్డులను ఏర్పాటు చేసింది. ఈ వితరణ కార్యక్రమంలో రోటరీక్లబ్ కమిటీ సభ్యులు ఆర్.శ్రీరామన్, పాఠశాల అధ్యక్షుడు రాధాకృష్ణన్, కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి, ముఖ్యఅతిథులుగా ప్రముఖ గాయకుడు కలైమామని ఉన్నికృష్ణన్, పాఠశాల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెనికాన్ - డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ కీలక ఒప్పందం

అడయార్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కటింగ్ ఎడ్జ్ కాంటాక్ట్ లెన్స్‌లతో మయోపియా నేత్ర సంబంధిత వ్యాధుల నియంత్రణకు మెనికాన్, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దేశంతో పాటు ఇతర దేశాల్లో మయోపియా నేత్ర వ్యాధి నియంత్రణకు ఎంతగానో దోహదపడనుంది. అలాగే, నేత్ర వైద్యులు, ఆప్తమాలజిస్టులకు అధునాతన శిక్షణ ఇవ్వడం, చికిత్సపై అవగాహన పెంచడంతో పాటు, అనుకూలమైన విస్తరణ ప్రణాళికలను పెంచడానికి సంయుక్త పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాలకు ఎంతగానో తోడ్పాటునివ్వనుంది. ఈ ఒప్పంద పత్రాలపై డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్, మెనికాన్ కంపెనీ రీజినల్ డైరెక్టర్ షన్సుకే యమగిషి సంతకాలు చేశారు. కాగా, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ 10 దేశాల్లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 236 ఆస్పత్రులను కలిగివుంది. అలాగే, కాంటాక్ట్ లెన్స్ తయారీలో ప్రపంచ వ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న మెనికాన్ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని డాక్టర్ అశ్విన్ అన్నారు.




ఒప్పంద పత్రాలతో డాక్టర్ అశ్విన్, షన్సుకే యమగిషి



తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్టు నుంచి ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ కోసం సైక్లింగ్ క్రీడాకారిణి జేపీ ధన్యదకు రూ.10లక్షల చెక్కును సోమవారం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి. చిత్రంలో క్రీడా శాఖ కార్యదర్శి మేఘనాథ రెడ్డి తదితరులు



# తెప్పపై పద్మావతీదేవి అభయం

తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం పద్మసరోవరంలో అమ్మవారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం




6.30గంటలకు ఉత్సవమూర్తిని పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి పూజలు నిర్వహించి తెప్పపై అధిష్ఠింపచేశారు. అనంతరం పుష్కరిణిలో మూడు చుట్లు అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం నాలుగు మాడ వీధుల గుండా ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గజవాహన సేవ జరగనుంది.

## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లు సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు**
**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,802**
**తలనీలాలు సమర్పించినవారు: 35,776**





# మహారథంపై గోవిందుడు

తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భక్తజన సందోహం మధ్య సోమవారం ఉదయం తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి మహారథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం 6.15గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాలవీధి, బేరివీధి, గాంధీరోడ్డుల మీదుగా యథాస్థానమైన రథమండపానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గోవిందన్నామ స్మరణలతో రథాన్నిలాగారు. ఆ సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య మహారథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించగా, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉత్సవాలలో జియ్యంగార్లు, ఎఫ్ఏఅండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో శాంతి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో గోవిందుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.





## గత నెల 1757.. ఇప్పుడు 3307 యూనిట్లు

### అదానీ స్మార్ట్ మీటర్లతో హడలిపోతున్న విద్యుత్తు వినియోగదారులు



అదానీ స్మార్ట్ మీటర్ బిగించాక వచ్చిన విద్యుత్ బిల్లు, ముందు వస్తున్న బిల్లు స్టేట్‌మెంట్

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదానీ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు హడలిపోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాక రెట్టింపు బిల్లులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగకున్నా బిల్లులు అధికమొత్తంలో వస్తుండడంతో చార్జీల భారం మోయలేమని వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు అంటున్నారు. ఇటీవల పాకాల మండలంలో వాణిజ్య వినియోగదారులకు అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చారు. ఈ నెలలో వచ్చిన బిల్లులు చూసి లబోదిబోమంటున్నారు. ఉదాహరణకు పాకాల ఆపరేషన్ పరిధిలో త్రీ ఫేజ్ వాణిజ్య సర్వీసు నెం.5426111005115 గత 23 నెలల్లో విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 1617 యూనిట్లు వినియోగమైంది. అత్యధికంగా ఒక నెలలో 25,963 రూపాయలు, అత్యల్పంగా ఒక నెలలో 16,732 రూపాయలు బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటర్ బిగించకముందు ఏప్రిల్ నెలలో 1757 యూనిట్లు వినియోగించి రూ.23,326 బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటరు బిగించాక మే నెలకు సంబంధించి ఒక్కసారిగా 3,307 యూనిట్లు వినియోగించారని, రూ.38,136 చెల్లించాలని బిల్లు వచ్చింది. వాడకం పెరగకపోయినా స్మార్ట్ మీటర్‌తో 1550 యూనిట్లు అదనంగా బిల్లులో చూపించి గత నెలకంటే రూ.14,810 ఎక్కువ రావడంతో వ్యాపారం ఎలా కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మీటరు ఉన్నప్పుడు పవర్ ఫ్యాక్టర్ 0.91, 0.88 వుండగా అదానీ స్మార్ట్ మీటర్‌తో పవర్ ఫ్యాక్టర్ 0.4 వచ్చింది. దీంతో యూనిట్లు పెరిగి బిల్లు అధిక మొత్తంలో వచ్చినట్లు తెలుస్తోంది. పాతమీటర్లతో రూ.300-400 వచ్చే బిల్లులు స్మార్ట్ మీటర్లతో 800-1000ల వరకు వస్తున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు. స్మార్ట్ మీటర్ల పనితీరును పరిశీలించకనే పాత మీటర్ల స్థానంలో బిగించి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు తొలగించి పూర్వం వున్న మీటర్లను బిగించాలని విద్యుత్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బత్తినయ్య కోనకు 'కన్నప్ప' బృందం

ఏర్పేడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ముసలిపేడు సమీపంలోని బత్తినయ్యస్వామి కోనకు సోమవారం 'కన్నప్ప' యూనిట్ వచ్చింది. ఈ సందర్భంగా మోదుగులపాళెం, ముసలిపేడు గ్రామస్థులు వీరికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మోహన్‌బాబు, మంచు విష్ణు, శివబాలాజీ బత్తినయ్యస్వామి కోనకు వెళ్లి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోలా ఆనంద్, షైలం దయాకర్, మంచు సుధాకర్‌నాయుడు, మంచు మస్తాన్‌నాయుడు, పులిపాటి చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌బాబు



ప్రత్యేక పూజలు చేస్తున్న మంచు విష్ణు, శివబాలాజీ

### శరవేగంగా కిలాంబాక్కం

# రైల్వే స్టేషన్ నిర్మాణం

**● జూలై నుంచి అందుబాటులోకి...?**



పెరంబూర్, జూన్ ( ఆంధ్రజ్యోతి): స్థానిక కిలాంబాక్కం రైల్వేస్టేషన్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ స్టేషన్ ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా, వండలూరు సమీపంలోని కిలాంబాక్కంలో రూ.394 కోట్లతో నిర్మించిన బస్ టెర్మినల్ 2023 డిసెంబరు నుంచి అందుబాటులోకి వచ్చింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ సమీపంలో తాంబరం-చెంగల్పట్టు రైలు మార్గం వెళుతోంది. కానీ, ఈ ప్రాంతంలో రైల్వే స్టేషన్ లేకపోవడంతో, సబర్బన్ రైలు నిలిచే అవకాశం లేదు. కిలాంబాక్కంకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రాంతంలో రైల్వేస్టేసన్ ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వేకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు వండలూరు-ఊరపాక్కం మధ్య కిలాంబాక్కంలో రూ.20 కోట్లతో రైల్వేస్టేషన్ నిర్మించాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. మూడు ఫ్లాట్‌ఫారాలతో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి 500 మీటర్ల దూరంలో ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటవుతోంది. బుకింగ్ కార్యాలయం, తాగునీట వసతి, టాయిలెట్ల నిర్మాణం తదితరాలు జరుగుతున్నాయని, వచ్చే నెలలో ఈ రైల్వేస్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

# మెట్టూరు డ్యాంలో పెరుగుతున్న నీటిమట్టం

**● అన్నదాతల హర్షం**

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల ప్రజల దాహార్తిని, అన్నదాతల సాగునీటి అవసరాలకు తీరుస్తున్న మెట్టూరు డ్యాం నీటిమట్టం వేగంగా పెరుతోంది. సేలం జిల్లా పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వందడుగుల పూర్తిసామర్థ్యం కలిగిన ఈ డ్యాంలో చేరుతుండటంతో సోమవారం కూడా నీటిమట్టం వందడుగులకు పైగా నమోదుకావడంపై డెల్టా రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 2024 అక్టోబర్ 23న మెట్టూరు డ్యాం నీటిమట్టం వందడుగులకు పెరిగింది. ఆ తర్వాత కావేరి డెల్టా జిల్లాల రైతుల కోరిక మేరకు ఈ డ్యాం నుండి సాగునీటిని విడుదల చేశారు. కొన్నినెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా మెట్టూరు డ్యాం నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ డ్యాంలో ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉండడంతో డెల్టా సాగుకోసం ఈ నెల 12న నీటిని విడుదల చేయనున్నట్లు ప్రజా పనులశాఖ అధికారులు తెలిపారు. ఇదిలావుండగా వందడుగులకు పైగా ఈ డ్యాంలో నీటిమట్టాలు పెరుగుతున్న దృష్ట్యా మత్స్య సంపద అధికమవుతుందని జాలర్లు కూడా హర్షం వ్యక్తంచేస్తున్నారు.





## శ్రీవారిసేవలో మద్రాసు హైకోర్టు మాజీ సీజే

తిరుమల, జూన్9(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి విజయ కమలేష్ తహిల్రమణి సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ విజయ కమలేష్ తహిల్రమణి →





సింహ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

### సింహ,ముత్యపు పందిరి వాహనాలపై

## శ్రీనివాసుడి విహారం

వడమాలపేట, జూన్ (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సింహ వాహనంపై స్వామివారు నరసింహస్వామి అలంకారంలో ఊరేగారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేతంగా స్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ జరిగింది. రాత్రి భోగశ్రీనివాసమూర్తిగా స్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఆశీనుడై మాడవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30-6.30 గంటల మధ్య ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు రూ.500 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాల్సి ఉంది.



ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

# ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాల ఆవిష్కరణ





ముద్దుకృష్ణమ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే - ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ..

పుత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్.. ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం ఆవిష్కరించారు. ముద్దుకృష్ణమ 79వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు రెండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానేతల సేవలను స్మరించుకున్నారు. అనంతరం చిన్నారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మహిళలకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. ముద్దుకృష్ణమ సేవాతత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సేవకుడిగా, నిరాడంబరతకు ప్రతీకగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. 1985లో విద్యాశాఖ మంత్రిగా ప్రతి గ్రామంలో ఒక పాఠశాల ఉండాలన్న సంకల్పానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ఫలితమే నాటి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి నేడు పెద్ద పెద్ద స్థానాల్లో స్థిరపడడానికి దోహదపడిందన్నారు. ఆయన మరణించి ఏడేళ్లు కావస్తున్నా.. విగ్రహావిష్కరణకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు రావడమే.. ప్రజల మదిలో ఆయన పదిలంగా నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎస్.ఎన్.ధనపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ వాసు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, గాలి గోపినాథ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కిలాంబాక్కం నుంచి సొంతూళ్లకు

## ఆరు లక్షల మంది ప్రయాణం

ప్యారీస్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తాలు, బక్రీద్, ఆదివారం సెలవుల సందర్భంగా నాలుగు రోజుల్లో నగర శివారు ప్రాంతమైన కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి ప్రభుత్వ బస్సుల్లో సుమారు 6,06,043 మంది సొంతూళ్లకు పయనమయ్యారు.

కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి దక్షిణ జిల్లాలకు నడుపుతున్న పలు బస్సులను కిలాంబాక్కంలో కొత్తగా నిర్మించిన బస్ టెర్మినల్‌కు మార్చారు. ఇక్కడి నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, తంజావూరు, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, నాగర్‌కోయల్, తూత్తుకుడి, కోయంబత్తూరు తదితర ప్రాంతాలకు ప్రతిరోజు 1,136 బస్సు లు నడుపుతున్న నేపథ్యంలో, శుభముహూర్తాలు, ప్రముఖ ఆలయాల విశేషాలు, బక్రీద్, ఆదివారం సెలవులను పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నడిపిన బస్సుల్లో సుమారు 6లక్షల మందికి పైగా కిలాంబాక్కం నుండి సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు. ఈ మూడు రోజుల్లో రిజర్వేషన్ చేసుకున్న 24,838 మందితో పాటు 2,76,735 మంది దూర ప్రాంతాలకు ప్రయాణం చేశారు. చివరి నిమిషంలో దూరప్రాంతాలకు వెళ్లాల్సినవారు రద్దీలో చిక్కుకోకుండా తమ ప్రయాణాన్ని ఎస్ఈటీసీ వెబ్‌సైట్ ద్వారా ముందుగానే రిజర్వేషన్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా సెలవులు, పండుగ సీజన్లలో అదనంగా బస్సులు నడపడానికి సౌలభ్యంగా ఉంటుందని స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ)మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ తెలిపారు.

## పింఛన్ అందక వృద్ధుల అవస్థలు

**● వేలిముద్ర పడక పడిగాపులు**



వేలిముద్ర పడకపోవడంతో వేచివున్న వృద్ధులు

తిరుత్తణి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలటీ పరిధిలో నివాసం వుంటున్న వృద్ధులు బయోమెట్రిక్ మిషన్‌లో తమ వేలిముద్ర పడక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే, సోమవారం ఉదయం పింఛన్ కోసం బ్యాంకుకు వెళ్లిన వృద్ధులకు అక్కడ ఉన్న బయోమెట్రిక్ మెషీన్‌లో వేలిముద్రలు వేయాలని బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో వృద్ధుల వేలిముద్రలు అందులో పడకపోవడంతో గంటలకొద్ది బ్యాంకు ఆవరణలో వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు బ్యాంక్ సర్వర్ కూడా మందగించడంతో తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. దీనిపై అక్కడి వృద్ధులు మాట్లాడుతూ పింఛన్ నగదు కోసం బ్యాంకుకు వచ్చే వృద్ధులను త్వరగా పంపాలని, తమను ఈ వయస్సులో గంటలకొలది వేచివుంచడం సరికాదని వాపోయారు. ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చే సదుపాయాలను అమలుచేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.

## హైకోర్టుకు బాంబు బెదిరింపు

టి.నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైకోర్టుకు సోమవారం సాయంత్రం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు వచ్చిన ఈ-మెయిల్ సందేశంలో కోర్టు భవనాల్లో బాంబులు అమర్చి ఉన్నాయని, అవి ఏ సమయంలోనైనా పేలవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ జనరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి హైకోర్టు అంతటా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని నిర్ధారించారు.